# అడవి బిడ్డలకు... అన్యాయం

న్యూస్‌టుడే, గోకవరం

- గిరిజనుల పేరిట వ్యాపారుల అక్రమం
- ఏజెన్సీలో యథేచ్ఛగా క్వారీల నిర్వహణ
- రూ.కోట్లలో తరలుతున్న ఖనిజ సంపద

కాకులను కొట్టి గద్దలకు పెట్టినట్లు ఏజెన్సీలో అధికారులు వ్యవహరిస్తున్నారు. దీంతో రూ.కోట్ల విలువైన ఖనిజ సంపద అక్రమార్కుల పాలవుతోంది. మన్యసీమలో పుష్కలంగా లభించే మెటల్, గ్రానైట్ వనరులను భారీగా కొల్లగొడుతున్నా... పట్టింపులేని యంత్రాంగం తీరు వ్యాపారులకు వరంగా మారుతోంది. కలర్ గ్రానైట్, మెటల్ క్వారీలను గిరిజనులే నిర్వహిస్తున్నట్లు రికార్డుల్లో ఉన్నా.. వారికి దక్కుతున్నది గోరంతే. అంతా బినామీ పేర్లతో మైదాన ప్రాంత వ్యాపారులే అనుభవిస్తున్నారు. ఈ అక్రమాలకు సాక్షాత్తు అధికారులే అండదండలు అందిస్తుండడమే ఇక్కడ విషాదం. ఫలితంగా రంపచోడవరం మండలం చుప్పరిపాలెం, గంగవరం మండలం నెల్లిపూడి వద్ద ఉన్న క్వారీల నుంచి ప్రతి నిత్యం రూ.లక్షల విలువైన రాయి అక్రమంగా తరలిపోతోంది.

...7లో



చుప్పరిపాలెంలోని కలర్ గ్రానైట్ కొండ ఇదే... (అంతర చిత్రం) పలకలుగా గ్రానైట్ తొలగించిన దృశ్యం

# గిరిజనుల ముసుగులో... ఎన్ని లొసుగులో!

న్యూస్‌టుడే, గోకవరం

తూర్పు ఏజెన్సీ అక్రమ వ్యాపారుల పాలిట కల్పతరువు... ఇక్కడ పేరు గిరిజనులది... ఆర్జించేది మరొకరు... రూ.వంద గిరిజనులకిచ్చి వేల రూపాయల సరకు పట్టుకుపోతున్న దోపిడీ విధానం ఇక్కడ సాగుతోంది. ఇక్కడ కోట్ల రూపాయలు సంపాదించి పెట్టే క్వారీలు బోలెడున్నాయి. జిల్లాలో 14 కలర్ గ్రానైట్ క్వారీలు ఉండగా ఏజెన్సీలోనే ఏడు ఉండడం విశేషం. వీటిలో ప్రస్తుతం రెండింటిలో తవ్వకాలు కొనసాగుతుండగా, మరో అయిదుచోట్ల పనులు ప్రారంభించాల్సి ఉంది. గిరిజనుల పేరిట సొసైటీ ఏర్పాటు చేసి యథేచ్ఛగా వ్యాపారాలు సాగిస్తున్నారు. రంపచోడవరం, గంగవరం, అడ్డతీగల మండలాల్లో క్వారీల సంఖ్య ఎక్కువగా ఉంది. రంపచోడవరం మండలం చుప్పరిపాలెం, గంగవరం మండలం నెల్లిపూడి వద్ద ఉన్న క్వారీలు అత్యంత విలువైనవి. ఈ రెండు క్వారీల నుంచి రూ.లక్షల విలువైన రాయి తరలిపోతుంది. పైకి ఇవన్నీ గిరిజనులే చేసుకుంటున్నారు అనిచెబుతున్నా ఎక్కువ శాతం బినామీ క్వారీలే.

## క్వారీ ఇలా చేజిక్కించుకుంటారు

ఒక ప్రాంతంలో కొండ క్వారీకి పనికి వస్తుందని తెలిసిన వెంటనే వ్యాపారులు రంగంలోకి దిగుతారు. సమీప గ్రామ ప్రజలను ఏదోవిధంగా ఒప్పించి వారి పేరు మీద సొసైటీ ఏర్పాటు చేస్తారు. తర్వాత ఆ ప్రాంతంలో క్వారీ నిర్వహణ వల్ల ప్రమాదమేమీ ఉండదని రెవెన్యూ అధికారుల నుంచి నిరభ్యంతర పత్రం



దేవీపట్నం, సీతానగరం మండల సరిహద్దులో మెటల్ క్వారీ

(ఎన్‌వోసీ) తీసుకునేందుకు అన్ని స్థాయిల్లో ముడుపుల బాగోతం కొనసాగుతుంది. ఆ సర్టిఫికెట్‌తో భూగర్భ గనుల శాఖాధికారులను కలిసి వారితో మంతనాలు జరిపి వారంలో అనుమతులు తెచ్చుకుని పనులు మొదలు పెడతారు. వీటి ద్వారా ప్రభుత్వ ఖజానాకు భారీగానే ఆదాయం వస్తుంది. ఏజెన్సీలో సుమారు 18 వరకు క్వారీలుండగా ఇందులో కొన్ని మాత్రమే నడుస్తున్నాయి. క్వారీకి అనుమతి పొందిన తర్వాత ప్రతి సంవత్సరం పొడిగింపునకు సొమ్ము చెల్లించాలి. ఈ చెల్లింపుల ద్వారా జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ ఖజానాకు రూ.42 కోట్ల ఆదాయం సమకూరుతుండగా, ఏజెన్సీ క్వారీల నుంచి అరకోటి వరకు రాయల్టీ లభిస్తోంది. ఇందులో చుప్పరిపాలెం, నెల్లిపూడి వద్ద గ్రానైట్ క్వారీలకే ఏటా రూ.1.20 లక్షలు చెల్లిస్తున్నారు. మరోవైపు క్వారీల్లో రూ.కోట్ల విలువైన పనులు జరుగుతున్నా స్థానిక గిరిజనులకు మాత్రం అరకొర సాయం మాత్రమే అందుతోంది. అమాయక గిరిజనం తమ పేరిటే క్వారీల నిర్వహణ జరుగుతోందనే విషయం తెలియకపోవడంతో వ్యాపారుల ఇష్టారాజ్యంగా మారింది. క్వారీల వల్ల స్థానికంగా కాలుష్యం, రహదారుల విధ్వంసం జరుగుతున్నా పట్టించుకునే నాథుడు లేడు. అడవికి చేటు కలుగుతున్నా సంబంధిత అధికారులు మాత్రం ఆవైపు కన్నెత్తికూడా చూడకపోవడం గమనార్హం.

## డ్వాక్రా మహిళలకు ఇస్తే లాభం

ఏజెన్సీలో ఇలాంటి అవకతవకలపై గిరిజనులు ఫిర్యాదు చేస్తే ఆ క్వారీలను రద్దు చేసే అధికారం ఐటీడీఏకు ఉన్నా ఈ విషయాలు పీవో దృష్టికి వెళ్లకుండా కొందరు అడ్డుకుంటున్నారు. అలాగే క్వారీల నిర్వహణకు ఆసక్తి ఉన్న గిరిజనులు నేరుగా ఐటీడీఏ పీవోకు విజ్ఞప్తి చేస్తే అనుమతి మంజూరుకు అవకాశం ఉంది. కానీ ఈ వివరాలు వారికి తెలియకపోవడంతో పరిస్థితి అక్రమార్కులకు అనుకూలంగా మారింది. ఈ నేపథ్యంలో డ్వాక్రా సంఘాలు క్వారీల నిర్వహణకు ముందుకు వస్తే అడవి సంపద గిరిజనులకే దక్కే అవకాశం ఉంటుందని స్థానిక ప్రజాప్రతినిధులు పేర్కొంటున్నారు. డ్వాక్రా మహిళలకు ఈ దిశగా రుణాలు ఇస్తే పలువురికి ఉపాధి కూడా దొరుకుతుంది. ఏజెన్సీ పంచాయతీలకూ ఆదాయం సమకూరి గ్రామాల అభివృద్ధి సాధ్యమవుతుంది.